ప్రభుత్వ కార్యాలయాలకు సొంత గూడు కరువు

- ఏళ్ల తరబడి అద్దె భవనాల్లో కార్యాలయాలు
- ఇరుకు గదులతో ప్రజలు, సిబ్బంది అవస్థలు



కొత్తూరులో అద్దె చెల్లించి నిర్వహిస్తున్న వెలుగు కార్యాలయం



కామవరపుకోటలో అద్దె భవనంలో నిర్వహిస్తున్న గ్రంథాలయ శాఖ

కామవరపుకోట: మండల కేంద్రమైన కామవరపుకోటలో ప్రజలకు సేవలందించే ప్రభుత్వ కార్యాలయాలకు సొంత గూడు కరువైంది. ఏళ్ల తరబడి అద్దె భవనాల్లోనే నిర్వహిస్తూ అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఆ కార్యాలయాలు ఇరుకు గదులతో వెలుతురు లేక సేవలందించే సిబ్బంది, కార్యాలయాలకు వచ్చే ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భూములు, స్థలాలు, కొనుగోలు, అమ్మకాలు నిర్వహించే సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని 40 ఏళ్లుగా స్థానిక గుర్రాల చెరువు సమీపంలో అద్దె భవనంలోనే నిర్వహిస్తున్నారు. నిత్యం ఇక్కడికి పదుల సంఖ్యలో భూముల రిజిస్ట్రేషన్ కోసం ప్రజలు వస్తూ ఉంటారు. కానీ ఇక్కడ కూర్చోవడానికి కుర్చీలు గాని నిలబడటానికి సరైన నీడ గాని లేకపోవడంతో వారు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అద్దె భవనాల్లోనే మరి కొన్ని కార్యాలయాలు

గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులు చదువుకునే బాలుర బీసీ వసతి గృహం గత 25 ఏళ్లుగా అద్దె భవనంలో నిర్వహించడంతో గదులు ఇరుకగా ఉండి, సరైన తలుపులు, కిటికీలు లేక వర్షాకాలం వచ్చిందంటే విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. నిత్యం వివిధ పనుల నిమిత్తం ప్రజలకు సేవలందించే పోస్ట్ ఆఫీస్ భవనం కూడా గత కొన్ని ఏళ్లుగా చింతలపూడి రోడ్డులో అద్దె భవనంలోనే నడుస్తుంది. అయితే ఇక్కడకు వచ్చే వారికి కూర్చోవడానికి సరైన సౌకర్యాలు లేక నానా అవస్థలు పడుతున్నారు. వివిధ కార్యకలాపాల కోసం వందల సంఖ్యలో మహిళలకు సేవలందించే మహిళా సమైక్య (వెలుగు) కార్యాలయం గత 12 ఏళ్లుగా అద్దె భవనంలోనే నిర్వహిస్తున్నారు. దీనికి ప్రభుత్వ నిధులతో స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో 2019లో సొంత భవనం నిర్మించారు. దానిని పూర్తి చేయకుండా నిర్లక్ష్యం చేస్తూ, అద్దె చెల్లించి ప్రజా ధనాన్ని వృథా చేస్తూ అద్దె భవనంలోనే వెలుగు కార్యాలయాన్ని నిర్వహించడంపై పలువురు విమర్శిస్తున్నారు. స్థానిక కామవరపుకోట గ్రంథాలయ శాఖ సుమారు 50 ఏళ్లగా అద్దె భవనంలో ఇరుకు గదులతో, వెలుతురు లేక, వర్షాకాలం వచ్చిందంటే పైనుంచి నీరు కారి అక్కడికి వచ్చే పాఠకులు ఇబ్బంది పడటంతో పాటు, అక్కడ పుస్తకాలు సైతం పాడై పోయిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి ప్రజా ధనాన్ని వృథా చేయకుండా, ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

సొంత భవనాలు నిర్మించాలి



గత కొన్నేళ్లుగా ప్రజలకు సేవలు అందించే ప్రభుత్వ కార్యాలయాలు ఏ విధమైన సౌకర్యాలు లేని భవనాల్లో అద్దె చెల్లించి నిర్వహిస్తున్నారు. దీని వలన ప్రజలు ఇబ్బంది పడటంతో పాటు ప్రజా ధనం వృథా అవుతుంది. కనుక అధికారులు స్పందించి ప్రజలకు సౌకర్యాలు కలిగించేలా ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించాలి.

– నానాది సాగర్, వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్, కామవరపుకోట



చింతలపూడి రోడ్డులో అద్దె భవనంలో పోస్ట్ ఆఫీస్



గుర్రాల చెరువు వద్ద అద్దె భవనంలో సబ్ రిజిస్టర్ కార్యాలయం



కామవరపు కోటలో పాత అద్దె భవనంలో బీసీ బాలుర వసతి గృహం

ఎన్‌సీసీ క్యాడెట్లకు ప్రాక్టికల్స్



ప్రాక్టికల్ పరీక్షల్లో పాల్గొన్న ఎన్‌సీసీ క్యాడెట్లు

జంగారెడ్డిగూడెం: ఆంధ్రా బెటాలియన్ ఏలూరు వింగ్ 19 పరిధిలోని జంగారెడ్డిగూడెం జెడ్పీ బాలుర హైస్కూల్‌లో ఎన్‌సీసీ క్యాడెట్లకు గురువారం ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలకు జంగారెడ్డిగూడెం జెడ్పీ బాలుర హైస్కూలు నుంచి 41 మంది క్యాడెట్లు హాజరయ్యారు. ఈ క్యాడెట్లకు రెండేళ్ల పాటు మిలటరీ డ్రిల్, ఆయుధ శిక్షణ, మ్యాప్ రీడింగ్ శిక్షణ అందించారు. ఎన్‌సీసీ ఏ సర్టిఫికెట్ పొందేందుకు ఈ పరీక్షకు హాజరయ్యారు. ఈ ప్రాక్టికల్ పరీక్షకు లెఫ్టినెంట్ కల్నల్ రిషిబ్ సిన్హా, మరో అధికారి డుమినీ, ఎన్‌సీసీ అధికారులు పర్యవేక్షించారు. ఎన్‌సీసీ ద్వారా విద్య ఉద్యోగ అవకాశాలు పొందొచ్చని జంగారెడ్డిగూడెం జెడ్పీ బాలుర హైస్కూల్ హెచ్ఎం కె.లోవకుమారి తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఎన్‌సీసీ కేర్ టేకర్ సీహెచ్ గంగరాజు, పాఠశాల ఫస్ట్ అసిస్టెంట్ ఎం.విజయ ప్రకాష్, స్టాఫ్ సెక్రటరీ టి.జగదీష్ బాబు పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు భూములు పంచాలి



సీపీఐ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

చింతలపూడి: అర్హులైన పేదలకు భూములను పంచాలని సీపీఐ మాజీ జిల్లా కార్యదర్శి మామిళ్లపల్లి వసంతరావు డిమాండ్ చేశారు. గణిజర్ల శాఖ మహాసభ బోయ పుల్లయ్య అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వసంతరావు మాట్లాడుతూ అర్హులైన పేదలకు వీఎస్ఎస్ భూములను పంచాలని, భూ పంపిణీ సూపర్ సిక్స్ పథకాల్లో ఒక పథకంగా చేర్చాలని, ఎప్పటి నుంచో ఉన్న ఎస్సీ ఎస్టీలకు భూమి కొనుగోలు పథకం కింద కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఒక ఎకరం చొప్పున భూమి ఇవ్వాలన్నారు. ముందుగా సిపిఐ పతాకాన్ని బోయ పుల్లయ్య ఆవిష్కరించారు. గ్రామంలో రోడ్ల పక్కన కట్టేస్తున్న గేదెలను సామూహికంగా ఒకే చోట కట్టేందుకు ఐదు ఎకరాల భూమిని కేటాయించాలని కోరారు. అనంతరం గ్రామ శాఖ కార్యదర్శిగా బోయ రాఘవరావు సహాయ కార్యదర్శిగా చేపలు శ్రీనివాసరావులను మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. మహాసభలో సీపీఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య సహాయ కార్యదర్శి తొర్లపాటి బాబు పాల్గొన్నారు.

వరుస చోరీలతో రైతుల్లో ఆందోళన



కోకో గింజలను దొంగిలించిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న రైతులు (ఫైల్)

జంగారెడ్డిగూడెం: రైతులు పొలాల్లోనూ, తమ ఇళ్ల వద్ద ఆరబెట్టిన కోకో గింజలు వరుస చోరీలకు గురవుతున్నాయి. మండలంలోని లక్కవరంలో వరుస ఘటనలతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల లక్కవరం గ్రామానికి చెందిన రైతు గురజాల శ్రీనివాస్ ఇంటి పక్కనే కోకో గింజలను ఆరబెట్టారు. కళ్లాల్లో ఆరబెట్టిన ఎండిన రెండు క్వింటాళ్ల కోకో గింజలను దొంగలు ఎత్తుకుపోయారు. పచ్చిగా ఉన్న గింజలను మాత్రం వదిలి వేశారు. అలాగే ఇటీవల అదే గ్రామానికి చెందిన కౌలు రైతు పెన్నాడ వెంకటేశ్వరరావుకు చెందిన మూడు క్వింటాళ్ల గింజలను దొంగిలించుకుపోయారు. దీనిపై ఈ ఇద్దరు రైతులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఇదిలా ఉంటే అంతకు ముందు జి.శ్రీరాములుకు చెందిన రెండు క్వింటాళ్లు, డి.అచ్చిరెడ్డికి చెందిన ఒకటిన్నర క్వింటాళ్లు, సత్యనారాయణ అనే రైతుకు చెందిన ఒక క్వింటాల్ కోకో గింజలను దొంగిలించుకుని పోయారు. కోకో గింజలు క్వింటాల్ ధర రూ.70 వేలు పలకడంతో ఈ చోరీలు చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన పూజలు చేస్తున్న స్థల దాత

బుట్టాయగూడెం: స్థానిక కుమ్మరిగట్టు సమీపంలో సత్యనారాయణస్వామి ఆలయ నిర్మాణానికి స్థల దాత ఆలపాటి దుర్గారావు గురువారం శంకుస్థాపన, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధి పెనుగుర్తి సోంబాబు మాట్లాడుతూ స్థల దాత ఆలపాటి దుర్గారావు గతంలో సుమారు ఏడు సెంట్ల స్థలాన్ని వినాయకుని, శివుని ఆలయాల నిర్మాణాలకు స్థలాన్ని దానం చేశారన్నారు. అయితే రానురానూ భక్తుల తాకిడి ఎక్కువగా ఉండడంతో ఇటీవల గుడికి వచ్చిన దుర్గారావు మరో ఆరు సెంట్ల స్థలాన్ని ఇచ్చారని చెప్పారు. ఆ స్థలంలో సత్యనారాయణ స్వామి ఆలయంతోపాటు కల్యాణ మండపాన్ని కూడా నిర్మిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నిమ్మగడ్డ దుర్గారావు, కొండేపాటి రామకృష్ణ, పెనుగుర్తి సోంబాబు, కోసూరి నరేష్, ఉమ్మడి వరపు నాగరాజు, దంగేటి కరుణకుమార్, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతకు పరామర్శ



రాజబాబును పరామర్శిస్తున్న దూలం నాగేశ్వరరావు, వాసుబాబు, తదితరులు

ద్వారకాతిరుమల: రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజబాబును ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు గురువారం పరామర్శించారు. రాజబాబు వారం రోజుల క్రితం బాత్రూంలో జారి పడిపోయారు. ఈ ప్రమాదంలో ఆయన ఎడమ కాలికి తీవ్ర గాయమైంది. విర్డ్ ఆస్పత్రిలో ఆయన చికిత్స పొందుతున్నారు. వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, పుప్పాల వాసుబాబు, ఏలూరు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి మామిళ్లపల్లి జయప్రకాష్ (జేపీ), చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కందులపాటి శ్రీనివాసరావు, ఏలూరు సిటీ పార్టీ అధ్యక్షుడు గడిదేసి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు నెరుసు చిరంజీవి, సిటీ బీసీ సెల్ అధ్యక్షుడు కిల్లాడి దుర్గారావు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మున్నాల జాన్ గురునాథం, రాష్ట్ర ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కోమటి విష్ణువర్ధన్, సయ్యపురాజు గుర్రాజు, బలే నాగరాజు, గాదిరాజు మణి కిషోర్ వర్మ, తదితరులు పాల్గొన్నారు.

తారా స్థాయికి భూ వివాదం



ర్యాలీ చేస్తున్న గిరిజనేతరులు

బుట్టాయగూడెం: మండల కేంద్రమైన బుట్టాయగూడెంలో సర్వే నంబర్ 550/1లో ఐదు ఎకరాల 30 సెంట్ల భూమికి సంబంధించి నెలకొన్న సమస్య తారా స్థాయికి చేరుకుంది. ఈ భూమిలో సీపీఎం కార్యకర్తలు గుడిసెలు వేశారు. అయితే ఈ భూమికి సంబంధించి తమకు హక్కులు ఉన్నాయని ఆ భూమి తమ పూర్వీకులదంటూ కరాటం సునీల్ తెలిపారు. గురువారం ఆ భూమిలో ఉన్న గుడిసెలను తొలగించే ప్రయత్నం గురువారం చేశారు. ఆ సమయంలో సీపీఎంకు చెందిన తెల్లం రామకృష్ణ ఆధ్వర్యంలో గిరిజనులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సీపీఎం కార్యకర్తలు రోడ్డుపై బైటాయించి వాహనాల రాకపోకలు నిలిపి వేశారు. ఆ సమయంలో ఏఎస్సై సోమరాజు, పోలీస్ సిబ్బంది అక్కడికి చేరుకుని ఏదైనా విషయం ఉంటే భూముల వద్దే మాట్లాడుకోవాలని ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దని చెప్పారు. రామకృష్ణ, కుంజా సత్యనారాయణను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇదిలా ఉంటే తెల్లం రామకృష్ణ పలు అక్రమాలకు పాల్పడుతున్నాడని, అతడిపై రౌడీ షీట్ తెరవాలని గిరజనేతరులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గిరిజనేతరులు, రైతులు పాల్గొన్నారు.

జాతిపిత మహాత్మా గాంధీకి ఘన నివాళి



రావి ఆకుపై జాతిపిత చిత్రాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థిని



కొయ్యలగూడెం: మహాత్ముడికి నివాళులర్పిస్తున్న దృశ్యం



జంగారెడ్డిగూడెం: నివాళులర్పిస్తున్న నాయకులు



టి.నర్సాపురం: గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నేతలు

కొయ్యలగూడెం: జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి కార్యక్రమం గురువారం విద్యాలయాలలో స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించారు. పరింపూడి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యార్థిని పులిబోయిన పూర్ణిమ రావి ఆకుపై గాంధీజీ చిత్రాన్ని వేసి తన దేశభక్తిని చాటుకుంది. కన్నాపురంలో మహాత్మా గాంధీ విగ్రహానికి వాసవీ క్లబ్ సభ్యులు నివాళులర్పించారు. కన్నాపురం శ్రీ వాసవి ఆర్య వైశ్య కల్యాణ మండపం వద్ద గల గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ కన్నాపురం అధ్యక్షుడు కొల్లూరి అనిల్ మనోహర్, కార్యదర్శి ఉద్దగిరి పవన్ కుమార్, పెనుగొండ హేమంత్, బొమ్మ పోసిబాబు, మట్టే శ్రీను, అద్దేపల్లి కేశవ, నల్లజర్ల సునీల్ పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెంలో

జంగారెడ్డిగూడెం: మహాత్మగాంధీ 77వ వర్ధంతిని పురస్కరించుకుని జంగారెడ్డిగూడెం పట్టణంలో వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద గాంధీజీ విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బలరాం రాంబాబు, వందనపు వేంకటేశ్వరరావు, టీవీఏ రామతారకం, దూబగుంట్ల బాపిరాజు, గుళ్లపూడి శ్రీనివాసరావు, యిమ్మడి బాలభాస్కర్, కొదుమూరి శేఖరం, మహంకాళి మధు, కిషోర్, ఆనంద్, కాటేపల్లి శ్రీనివాసరావు, బుల్లి, నాగసూరి వసంత్, తదితరులు పాల్గొన్నారు.

టి.నర్సాపురంలో

టి.నర్సాపురం: ప్రధాన సెంటర్‌లో మహాత్మా గాంధీ విగ్రహం వద్ద గురువారం ఆర్యవైశ్య సంఘ నాయకులు గాంధీజీకి నివాళులర్పించారు. గాంధీజీ వర్ధంతి సందర్భంగా మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీజీ దేశానికి స్వాతంత్ర ఉద్యమానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో అద్దంకి రామకృష్ణారావు, అద్దంకి రవి, మాదంశెట్టి సోమరాజు, నల్లూరి శ్రీనివాస్, మల్లికార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చిక్కాలకు వైఎస్సార్‌సీపీ నేతల అభినందనలు



చిక్కాల దుర్గాప్రసాద్‌ను అభినందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కొయ్యలగూడెం: ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టబద్రుల, ప్రభుత్వ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీలో ఉన్న చిక్కాల దుర్గాప్రసాద్‌ను వైస్సార్‌సీపీ నాయకులు గురువారం కలుసుకున్నారు. చింతలపూడి మీదుగా కొనసాగుతున్న దుర్గాప్రసాద్ పాదయాత్రలో ఆయనను కలుసుకొని పూల మాలలతో అభినందించారు. యాత్ర 31వ తేదీ టి.నరసాపురం మండలంతో పోలవరం నియోజకవర్గానికి చేరుకోనుందన్నారు. ఈ సందర్భంగా జంగారెడ్డిగూడెంలో మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఆధ్వర్యంలో ప్రసాద్‌కు అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. తాడిగడప రామకృష్ణ, బోడిగూడెం సర్పంచ్‌లు కడకట్ల గడ్డియ్య, ఏలేటి చిన్న తుక్కయ్య, తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘన



ద్వారకాతిరుమలలో ఉగాది మండపం వద్ద దర్శనమిస్తున్న ఫ్లెక్సీలు

ద్వారకాతిరుమల: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ను పటిష్టంగా అమలు చేయాలన్న జిల్లా కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.వెట్రిసెల్వీ ఆదేశాలను మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు బేఖాతరు చేస్తున్నారు. కోడ్ అమలులోకి వచ్చి 48 గంటలు గడిచినా, కొన్ని ప్రాంతాల్లో రాజకీయ పార్టీల నేతలకు సంబంధించిన ఫ్లెక్సీలు తొలగించలేదు. అలాగే దివంగత నేతల విగ్రహాలకు ముసుగులు వేయలేదు. ఈ క్రమంలో ద్వారకాతిరుమల క్షేత్రంలోని ఉగాది మండపం వద్ద, ప్రధాన రహదారి పక్కన టీడీపీ నేతల ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయి. అధికారులు వీటి ముందు నుంచే రాకపోకలు సాగిస్తున్నా, తొలగింపుకు చర్యలు చేపట్టకపోవడం గమనార్హం.

నిరుద్యోగ సమస్యల పరిష్కారానికి కృషి



చిక్కాల దుర్గాప్రసాద్‌కు స్వాగతం పలుకుతున్న నిరుద్యోగులు

టి.నర్సాపురం: నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉభయ గోదావరి జిల్లాల పట్టబద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి చిక్కాల దుర్గాప్రసాద్ అన్నారు. ఏలూరు నుంచి కాకినాడ వరకు నిర్వహిస్తున్న మహా పాదయాత్ర గురువారం టి.నరసాపురం చేరుకుంది. ప్రధాన సెంటర్‌లో ఆయనకు పలువురు నిరుద్యోగులు పూలమాలలు, పుష్ప గుచ్ఛాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 లక్షల ఉద్యోగాలు, మెగా డీఎస్సీ నోటిఫికేషన్, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, సీపీఎస్ రద్దు, వాలంటీర్ వ్యవస్థ పునరుద్ధీకరణ, ప్రైవేట్ టీచర్లు, లెక్చరర్లకు ప్రత్యేక చట్టం తీసుకురావడానికి కృషి, హెల్త్ కార్డుల జారీ, ఇళ్ల స్థలాల మంజూరు వంటి మేనిఫెస్టోతో ఎన్నికలకు వెళుతున్నట్లు తెలిపారు.

స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ కరువు



ఆగిపోయిన స్కూల్ బస్సును నెడుతున్న విద్యార్థులు (ఫైల్)

ద్వారకాతిరుమల: ప్రైవేట్ స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ ఉండడం లేదు. ఆర్టీవో అధికారుల పర్యవేక్షణ అంతంత మాత్రమేననే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల ద్వారకాతిరుమలలో ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు ఆగిపోయింది. దీంతో బస్సును విద్యార్థులే ముందుకు నెట్టారు. ఆఖరికి బస్సు స్టార్ట్ అవడంతో వారంతా అందులోనే ఇళ్లకు చేరుకున్నారు. అయితే పలు పాఠశాలల యాజమాన్యాలు కండిషన్‌లో లేని స్కూల్ బస్సులను తిప్పుతూ, విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నాయన్న విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులు స్కూల్ బస్సును నెడుతున్న ఈ దృశ్యం ఆ విమర్శలకు బలాన్నిస్తోంది.

విజేతలకు బహుమతులు

ఉంగుటూరు: జాతీయ భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గురువారం కైకరం హైస్కూల్ విద్యార్థులకు క్విజ్, డ్రాయింగ్, స్లోగన్స్ పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ద్వారకాతిరుమల: మండలంలోని ఎం.నాగులపల్లి సెక్షన్ పరిధిలోని పంగిడిగూడెం, వేంపాడు, ఎం.నాగులపల్లి, తిరుమలంపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిసర గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కేఎం అంబేద్కర్ తెలిపారు. భీమడోలు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో వార్షిక మరమ్మతుల్లో భాగంగా ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు కరెంట్ సరఫరా నిలిచిపోతుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నర్సరీ ఏర్పాటుపై అభ్యంతరం

కొయ్యలగూడెం: రాజవరం జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో అటవీశాఖ ఆధ్వర్యంలో నర్సరీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్న ఆలోచనను అధికారులు విరమించుకోవాలని గ్రామస్తులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నర్సరీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం వలన విద్యార్థులకు క్రీడా ప్రాంగణం ఉండదని, విష సర్పాలు నర్సరీలోకి చేరే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. 2017లో నర్సరీ కేంద్రాన్ని ఏర్పాటు చేయగా 2021లో జెడ్పీ హైస్కూల్‌లో ప్రభుత్వ మహిళా కళాశాల మంజూరైందని దీంతో నర్సరీ కేంద్రాన్ని రద్దు చేశారన్నారు. ప్రస్తుతం నర్సరీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని చూస్తున్న ప్రదేశంలో విద్యార్థులకు అనువుగా సైకిల్ స్టాండ్ నిర్మాణానికి ఎస్ఎంసీ కమిటీ యోచిస్తోందన్నారు. కాగా గతంలో నర్సరీ కేంద్రం ఉండకూడదని తీర్మానం చేసిన ప్రధానోపాధ్యాయుడు ఈ సారి నర్సరీ కేంద్రం ఏర్పాటుకు తీర్మానం చేయడంపై గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. రాజకీయ కోణాల నేపథ్యంలోనే ప్రధానోపాధ్యాయుడు నాటి నిబంధనలను కాదని ప్రస్తుత నర్సరీ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వడం పట్ల గ్రామస్తులు విమర్శిస్తున్నారు.

బాధ్యతా రాహిత్యాన్ని ఉపేక్షించం



ట్యాంకు వాచర్లను హెచ్చరిస్తున్న కార్యదర్శి

కొయ్యలగూడెం: పరింపూడి పంచాయతీ ట్యాంక్ వాచర్లు (పంపు డ్రైవర్లు) బాధ్యతా రాహిత్యంగా ప్రవర్తిస్తే విధుల నుంచి తొలగిస్తామని పంచాయతీ కార్యదర్శి కె.సురేష్ హెచ్చరించారు. గురువారం పరింపూడి పంచాయతీ పరిధిలో సుమారు 15 మంది ట్యాంక్ వాచర్లు విధులు నిర్వహిస్తుండగా ఇందులో కొంత మందిపై ప్రజలు అభియోగాలు చేస్తున్న నేపథ్యంలో ఆయన విచారణ చేశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని వేరే ట్యాంకుల వద్దకు వాచర్లుగా బదిలీ చేశారు. అదే విధంగా వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా అదనపు ట్రాక్టర్ ట్యాంకర్లను సిద్ధం చేస్తున్నామని సర్పంచ్ ముప్పిడి విజయకుమారి తెలిపారు. కొయ్యలగూడెంలోని కొన్ని వాటర్ సర్వీసింగ్ సెంటర్లకు ఏర్పాటు చేసిన పంచాయతీ పైపులైన్ల ద్వారా నీరు వధా అవుతోందని దీనిపై పాలకవర్గం దృష్టి సారించి వాటర్ సర్వీసింగ్ సెంటర్లకు పంచాయితీ పైప్‌లైన్లను తొలగించాలని వార్డు సభ్యులు కోరారు.

నేటినుంచి మరియతల్లి ఉత్సవాలు



ఉత్సవాలకు ముస్తాబు చేసిన మరియతల్లి ఆలయం

చింతలపూడి : అల్లిపల్లి మరియతల్లి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభం కానున్నాయి. శుక్రవారం నుంచి ఆదివారం వరకు మూడు రోజుల పాటు అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ ఉత్సవాలను ఇక్కడ జరుపుతారు. పశ్చిమగోదావరి జిల్లాలోని పలు గ్రామాల నుంచే కాక ఖమ్మం, కృష్ణా, తూర్పుగోదావరి జిల్లాల నుంచి కూడా మేరీ మాత భక్తులు ఈ ఉత్సవాలకు భారీగా తరలి వస్తారు. సుమారు లక్ష మందికి పైగా భక్తులు ఉత్సవాల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ఎంఎఫ్ గురువులు ఫాదర్ మరియజోజి నేతృత్వంలో భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేశారు. కొండపైకి చేరుకోవడానికి దారిని చదును చేసి, విద్యుద్దీపాలతో అలంకరించారు. ఉత్సవాలకు గట్టి బందోబస్తును ఏర్పాటు చేసినట్లు సీఐ రవీంద్ర నాయక్ తెలిపారు.